జోరుగా పింఛన్ల పంపిణీ



రణస్థలం: పింఛన్ పంపిణీ పరిశీలిస్తున్న ఎంపీడీవో ధనుంజయరావు



లావేరు: నరసయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు శ్రీనివాసరావు



ఎచ్చెర్ల క్యాంపస్: చినతవుడుకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రమ

ఎచ్చెర్ల క్యాంపస్: సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. తెల్లవారు జాము నుంచే వలంటీర్లు తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి పింఛన్లను అందజేశారు. ధర్మవరం గ్రామానికి చెందిన ఎచ్చెర్ల చినతవుడు అనారోగ్యంతో రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా..వలంటీర్ నేతింటి రమ అక్కడకు వెళ్లి వృద్ధాప్య పింఛన్ అందజేశారు.

లావేరు: మండలంలోని 23 సచివాలయాల పరిధిలోని అన్ని గ్రామాల్లో వలంటీర్లు పింఛన్లను లబ్ధిదారులకు అందించారు. అదపాక గ్రామానికి చెందిన వృద్ధుడు బొత్స నరసయ్య పొందూరు మండలం బాణాం గ్రామ పరిసర ప్రాంతాల్లో మామిడి తోటల కాపలాకు వెళ్లి అక్కడ అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. దీంతో పింఛన్ తీసుకోవడానికి అదపాక గ్రామానికి రాలేకపోయారు. విషయం తెలుసుకున్న అదపాక గ్రామానికి చెందిన వలంటీరు పి.శ్రీనివాసరావు అక్కడకు వెళ్లి నరసయ్యకు పింఛన్ డబ్బులు అందజేశారు.

రణస్థలం: మండలంలో పింఛన్ల పంపిణీ ప్రారంభమైందని ఎంపీడీవో వి.ధనుంజయరావు తెలిపారు. మండల కేంద్రంలోని జె.ఆర్.పురంలో పింఛన్ల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. మండలంలోని 28 గ్రామ సచివాలయ పరిధిలో 11,256 మందికి పింఛన్లు అందజేస్తున్నామన్నారు. తొలిరోజున సర్వర్ మొరాయించడంతో 60 శాతం మేరకు పింఛన్ల పంపిణీ జరిగిందని.. మిగతా 40 శాతం శుక్రవారం ఉదయం ఆరు గంటల్లోగా వలంటీర్ల ద్వారా అందజేస్తామన్నారు.

హామీలన్నీ నిలబెట్టుకున్నాం

● 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



ప్రజలకు సంక్షేమాన్ని తెలియజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: ఇచ్చిన ప్రతి హామీని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. పొన్నాడ గ్రామ సచివాలయం–2 పరిధిలోని కమ్మపేట, పంచిరెడ్డిపేట, గురువుపేట గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. రేషన్‌కార్డు వారీగా వర్తించిన లబ్ధిని తెలియజేసి బ్రోచర్లను అందజేశారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనపై ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 98 శాతం నిలబెట్టుకోవటంతో పాటు మరికొన్ని కొత్త పథకాలను అమలు చేశామన్నారు. ప్రజలు జగన్‌ను మారోసారి ముఖ్యమంత్రిగా చూడాలని అనుకుంటున్నారన్నారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. ప్రతి కార్యకర్త ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ నక్క కృష్ణమూర్తి, నేతింటి నీలం, బగ్గు రాజారావు, సర్పంచ్ నేతింటి యమున, ఎంపీటీసీ సభ్యులు అల్లు తులసమ్మ, పప్పల రాజేశ్వరి పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారంపై దృష్టి



మాట్లాడుతున్న వేణుగోపాలరావు

జి.సిగడాం: భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారం చేసేదిశగా పని చేయాలని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు సకాలంలో ఆన్‌లైన్ ద్వారా భూ హక్కు పత్రాలు అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొన్ని గ్రామాల్లో భూ రికార్డులు సరిగ్గా లేక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నట్టు గుర్తించి వీటి పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎక్కువగా కోర్టులో కేసులు ఉండటంతో కొన్ని పరిష్కారం సాధ్యం కాలేదన్నారు. సమస్య వచ్చిన వెంటనే సంబంధిత వీఆర్వో, ఆర్ఐల ద్వారా పూర్తి సమాచారం తెప్పించుకుని పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను రెన్యువల్ చేసేందుకు ఎవ్వరూ ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టామన్నారు. ఒన్–బీ రాకపోతే తక్షణమే వీఆర్వో లేక నేరుగా రెవెన్యూ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ నిర్మల, భూసర్వే డీటీ హనునుమంతురావు, ఆర్ఐ రామచంద్రరావు ఉన్నారు.

శ్రీకాకుళం ఎంపీడీవోగా రామ్మోహనరావు



రామ్మోహన్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఈవోపీఆర్‌డీ ప్రకాశరావు

శ్రీకాకుళం రూరల్/గార: శ్రీకాకుళం ఎంపీడీవోగా శిమ్మ రామ్మోహనరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గార మండలాభివృద్ధి అధికారిగా పని చేస్తూ సాధారణ బదిలీల్లో శ్రీకాకుళం రూరల్‌కు వచ్చారు. గార ఎంపీడీవోగా ఎనిమిదేళ్లు పని చేసి అందరి మన్ననలు పొందారు. గార మండలం అంపోలు పంచాయతీ సెక్రటరీగా, గార ఈవోపీఆర్‌డీగా కూడా గతంలో విధులు నిర్వహించారు. కాగా ఇప్పటి వరకూ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పని చేసిన రఘు నుంచి బాధ్యతలు తీసుకున్నారు. రఘు ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈవోపీఆర్‌డీ ప్రకాశరావు నూతన ఎంపీడీవో రామ్మోహనరావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉండాలి

● స్వామి కమలానంద భారతిస్వామిజీ



:శ్రీకాకుళం కల్చరల్: అనుగ్రహణ భాషణం చేస్తున్న స్వామిజీ



పాల్గొన్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉండాలని శృంగేరి పీఠానికి చెందిన భువనేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతిస్వామిజీ అన్నారు. బలగలోని నాగావళి నది ఒడ్డున ఉన్న బాలాత్రిపుర కాలభైరవ పీఠం ఆలయంలో గురువారం అనుగ్రహ భాషణ చేశారు. ప్రధాన గ్రంథాలైన రామాయణ, భారతాలు మనం ఎలా నడుచుకోవాలో తెలియచేస్తాన్నారు. వారు ఆచరించిన ధర్మాన్నే మనం అందరం ఆచరించాలని కోరారు. కార్యక్రమంలా పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి దర్శనం

గార: శ్వేతగిరిపై కొలువున్న వేణుగోపాలస్వామిని భువనేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతీ స్వామీజీ దర్శించుకున్నారు. గురువారం సాయంత్రం శాలిహుండం కొండపైకి వెళ్లిన స్వామీజీకి ఆలయ ధర్మకర్త సుగ్గు మధురెడ్డి, అర్చకులు ఎదురేగి స్వాగతం పలికారు. అనంతరం మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అలాగే శ్రీకూర్మంలోని శ్రీకూర్మనాథున్ని స్వామీజీ దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఈవో జి.గురునాథం, అర్చకులు దాసుబాబులు ఎదురేగి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు శ్రీరంగం మధుసూదనరావు ఉన్నారు.

ముగిసిన కల్యాణోత్సవం

శ్రీకాకుళం కల్చరల్:

స్థానిక చిన్నబజారులోని వేంకటేశ్వరస్వామి (దూదివారి) ఆలయంలో జరుగుతున్న కల్యాణోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఇందులో భాగంగా అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామికి సంప్రదాయంగా పవళింపు సేవను జరిపారు. అర్చకులు రేజేటి వేంకట శ్రీనివాసాచార్యులు, జగన్నాథాచార్యుల ఆధ్వర్యంలో నిత్యహోమాలు, పూర్ణాహుతి, ధ్వజా అవరోహణం, మండప ఉద్వాసన, పూర్ణాహుతి, అన్నదానం, స్వామివార్లకు ద్వాదశ తిరువారాధన, పుష్పాయాగం, పవళింపు సేవ జరిగింది. కార్యక్రమంలో ఈవో సర్వేశ్వరరావు, గీతా సత్సంగం సభ్యులు పాల్గొన్నారు.



పవళింపు సేవ అలంకరణలో వేంకటేశ్వరస్వామి

జాతీయ చెస్ పోటీలకు సేతు మాధవ్



సేతుమాధవ్‌ను అభినందిస్తున్న చెస్ సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ:జాతీయస్థాయి సీనియర్స్ చెస్ పోటీలకు జిల్లాకు చెందిన ఎల్లుమహంతి సేతుమాధవ్ ఎంపికయ్యాడు. ఈ మేరకు రాష్ట్ర చెస్ అసోసియేషన్ నుంచి వర్తమానం అందింది. మే 26 నుంచి తిరుపతి వేదికగా జరిగిన ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ చెస్ పోటీల్లో సేతుమాధవ్ రాణించడంతో జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 80 మంది రేటెడ్ ప్లేయర్స్‌తోపాటు 200 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించిన ఈ పోటీల్లో 8 రౌండ్లకుగాను.. పలువురు అగ్రశ్రేణి క్రీడాకారులను ఓడించి 6.5 పాయింట్లు సాధించి నాలుగోస్థానంలో నిలిచాడు. దీంతో ఆగస్టు 15 నుంచి మహారాష్ట్రలో జరగనున్న సీనియర్స్ జాతీయ చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాడు. సేతుమాధవ్ ఎంపికపై ఏపీ చెస్ అసోసియేషన్ కార్యదర్శి సనపల భీమారావు, జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు బగాది కిషోర్, కార్యదర్శి జామి రమేష్, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

వర్సిటీ డ్రైవర్‌కు సన్మానం



జనార్దనరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ ఉద్యోగులకు సర్వీసులో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని బీఆర్ఏయూ వీసీ నిమ్మ వెంకటరావు అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వర్సిటీ వాహన డ్రైవర్ ఎస్.జనార్దనరావును గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. వర్సిటీకి గ్రేడ్–1 డ్రైవర్‌గా జనార్దనరావు సుదీర్ఘ కాలం మెరుగైన సేవలు అందించారని కొనియాడారు. నిబద్ధత, అంకిత భావంతో వాహనం నడిపి తన సర్వీస్‌లో చిన్న ప్రమాదం సైతం చోటు చేసుకోకుండా విధి నిర్వహణను పూర్తి చేశారన్నారు. అనంతరం జనార్దనరావు దంపతులను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాళ్లు బిడ్డిక అడ్డయ్య, ఎస్.ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధ్రువీకరణ పత్రాల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీ పాలిసెట్ – 2023 కౌన్సెలింగ్ కొనసాగుతోంది. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్నారు. గురువారం 43001 నుంచి 58000 ర్యాంకు మధ్య విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. 373 మంది హాజరుకాగా, వీరిలో బీసీ, ఓసీలు 320, ఎస్సీ, ఎస్టీలు 53 మంది ఉన్నారు. గత నెల 29 నుంచి గురువారం వరకు మొత్తం 1455 మంది హాజరయ్యారు. శుక్రవారం 58001 నుంచి 74000 ర్యాంకు విద్యార్థుల పత్రాలు పరిశీలించనున్నారు. గురువారం నుంచి జరగాల్సిన ఆప్షన్ల ఎంపిక సాంకేతిక విద్యాశాఖ ఆదేశాలు మేరకు ఈ నెల 3కు వాయిదా వేసినట్లు కౌన్సెలింగ్ ఇన్‌చార్జి గురుగుబెల్లి దామోదర్‌రావు తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ



ఎరామర్శలో కిరణ్‌కుమార్

లావేరు: బుడుమూరు ఎంపీటీసీ సభ్యురాలు బొడ్డ సూరీడమ్మ కుమార్తె అనారోగ్య సమస్యతో ఇటీవల మృతి చెందింది. విషయం తెలియయడంతో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుడుమూరు గ్రామానికి గురువారం వెళ్లి సూరీడమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట ఏపీ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టరు కింతలి రమేష్‌బాబు, నాయకులు పెదనాయిని చిట్టిబాబు, బొడ్డ రవిబాబు, పెదనాయిని సత్యన్నారాయణ, సంజీవరావు, అచ్చిబాబు, గుండ రవి, కింతలి ప్రసాదరావు ఉన్నారు.

మంత్రి ధర్మాన ప్రత్యేక పూజలు



పూజల్లో మంత్రి ధర్మాన ప్రసాదరావు

ఎచ్చెర్ల క్యాంపస్: తమ్మినాయుడుపేట గ్రామంలోని చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ మొదటి వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికారు.

గోసాంలో రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో గ్రామ పెద్దలు

రణస్థలం: గోసాం గ్రామంలో సీతారామాలయం నిర్మాణానికి సర్పంచ్ కంబవు రామిరెడ్డి, గ్రామ పెద్దలు గురువారం శంకుస్థాపన చేశారు. గ్రామ పురోహితులు, ఇతర పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ భూమి పూజ జరిగింది. ఎన్నో ఏళ్లుగా ఆలయాన్ని నిర్మించాలనే కల సాకారమవుతుండడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ నిర్మాణానికి కొందరు స్థలాన్ని ఇవ్వగా.. మరికొందరు విరాళాలు అందజేశారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



బీమా చెక్కును అందజేస్తున్న ఎల్‌డీఎం సూర్యకిరణ్, బ్యాంక్ సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌డీఎం సూర్యకిరణ్ కోరారు. శ్రీకాకుళం డేఅండ్‌నైట్ జంక్షన్ ఆర్‌సీబీ బ్రాంచ్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో గురువారం ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనలో భాగంగా సాధారణ మరణం పొందిన పొన్నాడ వీరబ్రహ్మం భార్య పొన్నాడ లక్ష్మికి రూ.2 లక్షలు, దిస్క నీరజ సాధారణ మరణం చెందగా ఆవిడ భర్తకు రూ.2 లక్షల చెక్కును ఎల్‌డీఎం అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ పి.శ్రీనివాసరావు, బీమా అధికారి సురేష్‌కుమార్, రిలేషన్‌షిప్ మేనేజర్ హైమావతి, జగదీష్, బ్రాంచ్ సిబ్బంది వెంకటరాజు, లక్ష్మీ ఉపేంద్ర, స్వాతి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి హామీ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారాంపురం పంచాయతీ చినరావుపల్లిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు దుంప చిన్నారెడ్డి గురువారం ప్రారంభించారు. జాబ్ కార్డు ఉన్నవారు పనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గరిష్ట వేతనం వచ్చేలా వేతనదారులకు సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

అరసవల్లి: పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్న నేపథ్యంలో అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో గురువారం నుంచి భక్తులకు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ ఈవో వి.హరి సూర్యప్రకాష్ ఆదేశాల మేరకు ఇకమీదట ఆదివారంతో పాటు మిగిలిన వారాల్లో కూడా బయట వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని మజ్జిగ పంపిణీ జరిగే చర్యలు చేపడుతున్నారు. గురువారం సుమారు 400 మంది మజ్జిగను స్వీకరించారు.

వైభవంగా అంకురారోపణ పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని గుడివీధి ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయంలో ఉమా రుద్రకోటేశ్వరుల కల్యాణ వేడుకల నిర్వహణకు గురువారం అంకరారోపణ పూజలు జరిగాయి. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో ఉత్సమూర్తులను ప్రత్యేకంగా పూలతో అలంకరించి ఆలయ మండపంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంకురారోపణం, ప్రధాన, ప్రవేశ, ఆగ్నేయ స్థాలీపాక హోమాదులు జరిగాయి. కార్యక్రమంలో రుత్వికులు, చంద్రశేఖరశర్మ పాల్గొన్నారు.

ఘనంగా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక పూజల్లో భక్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: తమ్మినాయుడుపేటలోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం 54 రకాల ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. హోమాలు, దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

జి.సిగడాం: వాండ్రంగి పంచాయతీ చీడిపేట కాలనీ శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డు పనులను సర్పంచ్ సాకేటి నాగరాజు గురువారం ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం నిధులతో పనులు చేపడుతున్నట్టు చెప్పారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఇటీవల గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంలో స్థానికులు రహదారి కోసం విన్నవించుకోవడంతో అధికారులు నిధులు మంజూరు చేశారన్నారు. ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి వడగ గౌరీశంకరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ లోకేష్ ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమం వర్తింపు

జి.సిగడాం: అర్హులందరికీ సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం చేరువ చేస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. బాతువ గ్రామంలో గురువారం కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారని..అయితే ప్రజలు వీటిని నమ్మేస్థితిలో లేరని స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త అంకిత భావంతో పనిచేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు.. చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలన్నారు.నాయకులు బూటు అప్పారావు, ముల్లు నర్సింహంమూర్తి, అబోతుల జగన్నాథం, బాలి రమేష్ ఉన్నారు.

సంక్షిప్తంగా...

ఆదిత్యుని ఆలయంలో బదిలీలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో పలువురు ఉద్యోగులకు బదిలీలు చేయడంతో పాటు డిప్యూటేషన్ల బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

రేపు డయల్ యువర్ యూనివర్సిటీ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో శనివారం డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య 8247861919 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

పెదలింగాలవలసలో నేత్ర వైద్య శిబిరం

లావేరు: వైఎస్సార్ కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెదలింగాలవలస పంచాయతీ సర్పంచ్ లుకలాపు యశోద అన్నారు. గ్రామంలో కంటి వెలుగు పథకంలో భాగంగా నేత్ర వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో కంటి వెలుగు పథకం వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ తరగతులు ప్రారంభం

రణస్థలం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు గురువారం తెరచుకున్నాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ సూర్యప్రసాద్ మాట్లాడుతూ.. కళాశాల అధ్యాపకులు సప్లిమెంటరీ పరీక్షల స్పాట్ వ్యాల్యూయేషన్ విధులకు వెళ్లారన్నారు. దీంతో విద్యార్థులెవరు మొదటి రోజు తరగతులకు హాజరు కాలేదని చెప్పారు.

త్వరలో ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ శిక్షణ

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో హెవీ డ్రైవింగ్‌లో 13వ బ్యాచ్ ఈ నెల 2వ వారంలో ప్రారంభించనున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే 12 బ్యాచ్‌లు విజయవంతంగా పూర్తయ్యాయని చెప్పారు. 200 మంది అభ్యర్థులు శిక్షణ పొందినట్లు పేర్కొన్నారు. 30 ఏళ్ల అనుభవం కలిగిన రీజనల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్స్‌తో 32 రోజుల శిక్షణతో పాటు మెకానికల్ క్లాస్, యోగా, వ్యక్తిత్వ వికాసం, ప్రథమ చికిత్స, వాహనం విడిభాగాల మీద శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు శ్రీకాకుళం జిల్లా మేనేజర్ కార్యాలయంలో గానీ, 9963091999, 7382921920 నంబర్లను గానీ సంప్రదించాలని కోరారు.

వైభవంగా హనుమాన్ మందిర ప్రతిష్ఠ

లావేరు: చినమురపాక గ్రామంలో నూతనంగా నిర్మించిన అభయ ఆంజనేయస్వామి మందిరం ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యాహవచనం, అగ్నిస్థాపన పూజలు నిర్వహించారు. సాయంత్రం తిరువీధి చేపట్టారు. మహిళలు స్వామికి ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా బాబా ఆలయ వార్షికోత్సవం

జి.సిగడాం: పెంట గ్రామంలోని షిర్డీసాయిబాబా ఆలయ 11వ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పూజ్య గురువులు అమ్ముల సాంబశివరావు ఆధ్వర్యంలో సత్యవ్రతాలు, హోమాలు నిర్వహించారు. నాగులవలస, మర్రివలస, వీఆర్ అగ్రహారం, సీతంపేట, నక్కపేట, గేదెలపేట, మానంపేట, లింగాపురం, రాజాం, పాగిరి గ్రామాలకు చెందిన సాయిస్వాములు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది.

షాపుల బహిరంగ వేలం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రం సమీపంలోని జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న పోలీసు సిబ్బంది విశ్రాంతి గృహ సముదాయంలోని కింది వరుసలో ఉన్న నాలుగు షాపులు, పాత డీఎస్పీ కార్యాలయం వద్ద షాపింగ్ కాంప్లెక్సు, రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న నాలుగు షాపులకు ఈ నెల 6న బహిరంగ వేలం వేసి అద్దెకు ఇవ్వనున్నట్లు ఎస్పీ జి.ఆర్.రాధిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6న ఎచ్చెర్లలోని ఆర్మ్‌డు రిజర్వ్ పోలీసు విభాగం పరిధిలో ఉన్న కొబ్బరి, జీడి, మామిడి తోటలను వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు వెల్ఫేర్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ టి.ఉమామహేశ్వరరావు(6309990841)ను సంప్రదించవచ్చని తెలిపారు.